
# ఇంద్రధనుస్సు

ఐ. కవిత




''చూడండి.. నిన్న రాత్రి వరకూ ఇక్కడ.. మీ బడ్డీ పక్కనే ఓ కిళ్ళీ కొట్టు వుండేది. అది.. అతను... లేరేం?'' ఆశ్చర్యాన్ని వెలిబుచ్చుతూనే అడిగాడతను.

''ఆ షాపిక వుండదు'' అదంతే అన్నట్లు కచ్చితంగానూ, కఠినంగానూ బదులు చెప్పాడు మిఠాయి బండి వాలా.

''నిన్నరాత్రి కూడా వుందే!''

''కిందటి నిముషం వరకూ వున్న మనుషులే- ఠః నిమిషం జీవించి వుండాలని రూలేమీ లేదు. అలాటిది ఓ కిళ్ళీ కొట్టనగా ఎంత? ప్రాణమూ, వ్యాపారమూ కూడా అనిశ్చయాలే''

చలపతికేమీ అర్థం కాలేదు.

''ప్రాణం పోవడానికి కొన్ని క్షణాలు, వ్యాపారం పోవడానికి కొన్ని గంటలు...''

కంగారుగా అడిగాడు చలపతి. ''ప్రకాష్ కేమీ కాలేదు కద? క్షేమంగానే వున్నాడా?'' మిఠాయి బడ్డీ అతను నవ్వాడు. ''షాహుకారు గారూ! మీ దయ వలన ఇప్పటికతను మిగిలీ, క్షేమంగానే వున్నాడు. మీలాటి షాహుకార్లతని షాపునే నిలువునా వేలం

వేసేసి- ఒచ్చిన డబ్బు పంచేసుకున్నారు- ఉదయమే. యు ఆర్ లేట్. ఉదయం తొమ్మిదికి వచ్చి వుంటే... సర్లెండి. రుణం- ప్రాప్తం లేదనుకోండి. మీ అకౌంటెంత?''

''ఇరవయ్. ఐతే... ప్రకాష దుకాణం వేలం వేయబడిందన్నమాట. అయ్యో! మరెలా?''

''ఇరవై రూపాయిల కోసం మరీ ప్రాణం పోతున్నట్లు బాధ పడతారేం? అప్పు చేసినవాడి క్షేమం కోసం అతని భార్యాబిడ్డల కంటె కూడా ఆత్రత పడేది అతని కప్పిచ్చినవాడే అన్న నిజాన్ని మీరు రుజువు చేస్తున్నారు!'' నవ్వాడతను. అతని

కానందంగా వున్నట్లుంది చలపతిని చూస్తుంటే.

''నేను ప్రకాష్‌ని కలుసుకోవాలి. ప్లీజ్. మీరు చదువుకున్నవారిలా వున్నారు''

''ఎమ్మే ఎకనామిక్స్- గోల్డ్‌మెడలిస్ట్‌ని. కాని ఓ.సి.ని. అంచేత ఉద్యోగావకాశాలు మూసేసింది ప్రభుత్వం. ఓ.సి. అయినా బతకాలి కదా? అగ్రకులంలో పుట్టిన నేరానికి బలవంతంగా చావలేను కదా? అంచేత నేనీ మిఠాయి కొట్టు పెట్టుకున్నాను. ప్రకాష్ నాకు స్నేహితుడే. అతను గ్రాడ్యుయేట్, బి.కాం. అన్న పేరేకాని వ్యాపార సూత్రాలు తెలియవు. వ్యాపారమంటే నమ్మకం అనుకుని మనుషులని నమ్మి మోసపోయాడు, నేను చెబుతున్నా వినకుండా. మేం మిత్రులం.''

తెలుగు కథా సమితి (న్యూజెర్సీ) ఉగాది మినీ కథల పోటీలో రూ. 300 గెలుపొందిన రచన

"దయుంచేసి నాకతని ఇంటి అడ్రెస్ చెబితే..."

"చెప్పను. చెప్పను గాక చెప్పను. పడ్డిన పాముని మరొక దెబ్బ వేసేందుకు ప్రయత్నించే పనికి నేను పాల్పడను. వ్యాపారస్తుడికి పైసలు ముఖ్యం అన్నది నిజమే కాని- మానవత్వాన్ని పూర్తిగా విస్మరించెయ్యకూడదు. మీరు- మూడవ వారు లేటుగా వచ్చిన వారిలో. సారీ. వెళ్లండి. ప్రకాష్ ఈ రాత్రికే ఊరు వదిలి వెళ్ళిపోతాడు. కావలసినవారి పేరిట ఆస్తులు బదిలీ చేసి ఐ.పి. పెట్టడం కాకపోతే- వ్యాపారస్తుడికి దివాలా తీయడం నిజంగా అవమానకరమే. అతను అలాంటి అవమానం భరించలేకే ఊరొదిలి పోవడం! నేను అడ్రెస్ చెబితే మీరతని మీద పడతారు పీక్కు తినడానికి. డబ్బుకి దయా వుండదు, మానవత్వమూ వుండదు. అందుకే ప్రపంచంలో ఇంత మంది శవం మీద డబ్బులేరుకునేవాళ్లు!" అసహ్యంగా చూశాడతను చలపతివేపు.

అతను కదలలేదు.

సినిమాహాలు కెదురుగా వుండే బడ్డీలకు సాయంత్రం ముదురుతూంటే తప్ప వ్యాపారం ప్రారంభం కాదు. బండిలో తినుబండారాలను ఆకర్షణీయంగా సర్దుకుంటున్నాడు ఎమ్మే ఎకనామిక్స్.

"మీరు ప్రకాష్‌కి మంచి మిత్రులే ఐతే- నేనతన్ని కలుసుకుందుకు తప్పక సాయం చేయాలి" ప్రార్థిస్తున్నట్లున్నాడు చలపతి.

"మంచి మిత్రుణ్ణి కనుకనే - నేను మీకు సహకరించను. ఉదయం- అటు ప్రకాష్‌ని నిలబెట్టి అతని కనుల ముందే అతనికప్పిచ్చిన మీ లాటి షాహుకార్లు అతని కొట్లోని సామానులన్నీ... ఎవరికి బడ్డీని పంచేసుకుంటూంటే... ప్రకాష్ ముఖంలోని బాధను నేను జీవితంలో మరచిపోలేను. అరువు తీసుకున్న కస్టమర్లు బాకీలు చెల్లించక... అప్పిచ్చిన వాళ్ళు ఆగక... ప్రకాష్‌ని వేలం వేశారు. ఆ దృశ్యం ఎంత భయంకరం! మీ లాగే ఆ షావుకార్లూ- సిల్కు చొక్కాలూ, బంగారపుటుంగరాలతో... ఆ మీరు తొందరగా వెళ్లిపొండి నా ముందు మంచి. లేకపోతే నా కసలే కోపమెక్కువ. కోపమొస్తే నేను మనిషిని కాను."

"మీకు కోపం తెప్పించడం నా ఉద్దేశ్యం కాదు. నేను మనిషిని. సాటి మనిషికి ఒక చిన్న ఉపకారం చేయగలరా? ప్లీజ్..."

## స్వపరిచయం

**జననం: 1970.**

విద్యాభ్యాసం: ఇంటర్మీడియెట్

ఇతర రచనలు: లోగడ ఆంధ్రజ్యోతి నిర్వహించిన మినీ కథల పోటీలో బహుమతిపొందిన 'తెలుగు బస్సు', ఆంధ్రభూమి మినీ కథల పోటీలో బహుమతి పొందిన 'తనేనా?' విజయలో 'అమ్మా! నన్ను చంపెయ్' కథయి, ఇంకా మరో పది కథలు, ఆంధ్రజ్యోతి నవలా ప్రియదర్శిని పథకంలో ప్రచురితమైన 'వెన్నెల' నవలిక, సప్తపది డైరెక్టు నవల.

ఫోటో పంపలేక పోతున్నందుకు మన్నించమని కోరుతూ.

— ఐ.కవిత

"ఏమిటి?" విసుగ్గా చూసాడతను- చలపతి వేపు.

"ప్రకాష్ పరిస్థితికి అప్పిచ్చిన షావుకార్ల కంటె బాకీ సామానులరువు తీసుకుని వెళ్లి బాకీలు చెల్లించని వినియోగదారులే ఎక్కువ బాధ్యులని నా అభిప్రాయం-"

"ఔను. కరక్టుగా నిజమదే."

"రోజులెంత చెడ్డవయినా...డబ్బు ఎంత పాపిష్టి దయినా... మంచితనం శిక్షించబడకూడదని నా ఉద్దేశం.

"నిన్న రాత్రి- యింటర్ మిషన్‌లో ప్రకాష్ దగ్గర నేను సిగరెట్లూ, మా పిల్లలు కూల్‌డ్రింక్సూ, చాకెలెట్లూ తీసుకున్నాం. ఇరవై రూపాయిలయింది. కాని నా దగ్గర వంద నోటు తప్ప చిల్లర లేదు. పరిస్థితి గమనించి- "రేపివ్వచ్చు లెండి. వెళ్లండి. సినిమా పోతుంది-" అనేశాడు ప్రకాష్. ముక్కూ మొహమూ తెలీని నా మీద ఎంత నమ్మకం! ఎంత విశ్వాసం! నన్ను అసౌకర్యానికి గురిచేయకుండా ఎంత మంచితనం చూపాడని!

"ఇదుగో నేను చెల్లించవలసిన పైకం. ఇదీ... దీనితో పాటు నా కృతజ్ఞతలూ, ఆయన పరిస్థితికి నా హృదయపూర్వక సానుభూతి అందజేయండి. నేను బాధపడుతున్నాను-" అతని కంఠం భారంగా వుంది.

ఎమ్మే ఎకనామిక్స్ ఆశ్చర్యంగా చూశాడు- చలపతివేపు.

"నిన్న రాత్రి అతనికి నేనిరవై రూపాయిలు బాకీ పెట్టడం కాక... అతనికి వంద నోటిచ్చేసి నేనే ఇవాళ ఎనభై రూపాయిలూ తీసుకుందుకు వచ్చి వుంటే... ప్రకాష్ పరిస్థితి వేరుగా వుండేదేమో. అలా జరిగి వుండేది కాదేమో. మంచితనానికంత శిక్షా... అన్యాయం." చలపతి బాధగా... పశ్చాత్తాప పడుతున్నట్లు అన్నాడు.

"మాస్టారూ!"

చలపతి అతనివేపు చూశాడు.

"ఎంత మంచి వారు మీరు షాహుకారనుకుని దురుసుగా మాట్లాడాను. క్షమించండి. మీరు నా కళ్లు తెరిపించారు. కస్టమర్ అంటే- కష్టములు పెట్టువాడనే భ్రమలో వున్న నాకు మీ సిన్సియారిటీ జ్ఞానోదయం కలిగించింది. మీరు కోరినట్లే ప్రకాష్ కందజేస్తాను."

"థ్యాంక్స్" అని కదిలాడు చలపతి.

వెళ్లిపోతున్న చలపతిని చూస్తూ -'ఆకాశం ఎప్పుడూ వర్షిస్తూనే వుండదు. ఒక్కొక్కప్పుడు ఇంద్రధనస్సూ వుంటుంది. కస్టమర్లలోనూ మంచి వాళ్లుంటారు' అనుకున్నాడు అతను.



ఇటీవల రాజ్ భవన్‌లో 'ధ్వన్యనుకరణ రత్న' శ్రీ సిల్వెస్టర్ మిమిక్రీ తిలకించి అభినందనలతో జ్ఞాపిక బహూకరిస్తున్న రాష్ట్ర గవర్నర్ శ్రీమతి కుముద్‌బెన్ జోషి